

ఆదివాసీ కళాకారుల ప్రదర్శన

నమస్తే తెలంగాణ

# జనగామ

3 | గురువారం 2 మే 2024 | JANAGAON



మహబూబాబాద్ రోడ్‌షోలో జైకొడుతున్న కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి



మహబూబాబాద్‌లో కేసీఆర్ రోడ్‌షోకు తరలివచ్చిన అశేష జనవాహిని

- జిల్లా ఉండాలన్నా.. సీఎం మెడలు వంచాలన్నా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి
- మాయమాటల కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలె
- మహబూబాబాద్, డోర్నకల్ చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చింది బీఆర్‌ఎస్సే..
- మహబూబాబాద్ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

# మానుకోట జిల్లా ఉండాలా? వద్దా?

## ఉండాలంటే మాలోత్ కవిత గెలువాలె..

మహబూబాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మహబూబాబాద్ జిల్లాను రద్దు చేస్తా అంటున్నడు.. మీ జిల్లా ఉండాలా? వద్దా? ఉండాలంటే మాలోత్ కవితను గెలిపించుకోవాలని బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. మహబూబాబాద్ జిల్లా ఉండాలన్నా, జిల్లాను రద్దు చేస్తా అన్న సీఎం రేవంత్‌రెడ్డి మెడలు వంచాలన్నా ఇక్కడ మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ ప్రాంతం పోరాటాల ఖిల్లా అని, ఆ విషయాన్ని గుర్తించే తాను మహబూబాబాద్‌ను జిల్లా చేశానని, ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు రద్దు చేస్తాం అంటున్నారని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా నీళ్లు తెచ్చి వెన్నవరం ద్వారా మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాల్లోని చివరి ఆయకట్టు వరకు కాళేశ్వరం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చిందని అన్నారు. 'ఇప్పుడు మీకు నీళ్లు వస్తున్నాయా? మీకు రైతుబంధు వచ్చిందా? మీకు తులం బంగారం ఇచ్చారా?' అంటూ కేసీఆర్ ప్రజలను అడుగగా, రాలేదు.. రాలేదు అంటూ సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటి ఇచ్చి ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని, ఒక పథకం అమలు చేసే ముందు మంచీచెడు ఆలోచించాలని, ప్రజలకు పథకాలు ప్రవేశపెట్టినప్పుడు ఇంకో వర్గాన్ని దెబ్బతీసేలా ఉండొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు ఉంటున్నదా? బోర్లలో నీళ్లు ఉన్నయా? వడ్లకు బోనస్ ఇచ్చారా? మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామని ఇచ్చారా? ఏదీ అమలు కాలేదన్నారు. ఈ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పథకాలు ఇయ్యకున్నా ఏమీ కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, పథకాలు కావాలన్నా.. జిల్లా మీకు ఉండాలన్నా మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఖమ్మం, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట ప్రాంతాల్లో తాగు నీటికి బదులు మురికినీళ్లు వస్తున్నాయని, నాలుగైదు నెలల్లోనే మిషన్ భగీరథ నీళ్లు ఎటుపోయాయని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని, గిరిజనుల కోసం బంజారా భవన్ కట్టించామని, పది శాతం రిజర్వేషన్ పెంచామని, తండాలను గ్రామపంచాయతీలు చేశామని, ఇన్ని చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరగదని, జరగనీయనని స్పష్టంచేశారు. కవిత బ్రహ్మాండంగా పనిచేస్తుందని, మచ్చలేని నాయకురాలని, పోయినసారి అవకాశం ఇస్తే ఐదేళ్లు నిస్వార్థంతో సేవ చేసిందని, మరోసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. మహబూబాబాద్‌లో ఈ రోడ్‌షోను చూస్తుంటే నేల ఈనిందా అన్నట్టుగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిక్షణం ప్రజల కోసం, ప్రగతి కోసం పనిచేస్తుందని, ఈ విషయం గుర్తుంచుకొని బీఆర్‌ఎస్‌ను ఆదరించి కారు గుర్తుపై ఓటు వేసి కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో కార్యకర్తలు, ప్రజలు సీఎం.. సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



బిల్డింగ్ పైనుంచి కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

### కవితను భారీ మెజార్టీతో గెలిపించాలి



కవిత నివాసంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో సమావేశమైన అధినేత కేసీఆర్

### ముఖ్య నాయకుల సమావేశంలో కేసీఆర్

మహబూబాబాద్, మే 1(నమస్తే తెలంగాణ) : మానుకోట అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు. బుధవారం రాత్రి ఎంపీ మాలోత్ కవిత నివాసంలో మానుకోట లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మన సర్వేలో కవిత భారీ మెజార్టీతో గెలుస్తుందని వచ్చిందని, మరింత కష్టపడితే కవిత గెలుపు నల్లేరు మీద నడకేనని చెప్పారు. కవిత విజయం కోసం అందరూ సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు సమావేశంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సిరికొండ మధుసూదనాచారి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రేగా కాంతారావు, బానోత్ హరిప్రియా నాయక్, జడ్పీ చైర్‌పర్సన్లు అంగోత్ బిందు, బడే నాగజ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్వా యి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు



కేసీఆర్‌కు అభివాదం చేస్తున్న ప్రజలు

# కదంతొక్కిన మానుకోట

- నలుదిక్కుల నుంచి కదిలొచ్చిన జనం
- బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం
- ఆటపాటలతో హోరెత్తిన పట్టణం
- కేసీఆర్ రోడ్‌షో గ్రాండ్ సక్సెస్

మహబూబాబాద్, మే 1(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు జనం ప్రభంజనమై కదలివచ్చారు. నలుదిక్కుల(వరంగల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలు) నుంచి చీమలపుట్టల్లోంచి బారులు తీరినట్టు కదంతొక్కారు. ఏజెన్సీ సహా అన్ని ప్రాంతాల నుంచి దండులా రావడంతో మహబూబాబాద్ పట్టణం జనసంద్రమైంది. బస్సుయాత్ర జిల్లాలో ప్రవేశించింది మొదలు అడుగడుగునా నీరాజనం పలికారు. డప్పుచప్పుళ్ల నడుమ నెత్తిన బతుకమ్మలు, బోనాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. భారీ కటౌట్లు, గులాబీ తోరణాలతో మానుకోట ప్రాంతమంతా గులాబీమయమైంది. కేసీఆర్ బస్సు పైకి రాగానే రోడ్డుషో ప్రాంగణంతా 'కేసీఆర్.. కేసీఆర్.. సీఎం సీఎం' అంటూ నినాదాలతో మార్మోగింది. బుధవారం సాయంత్రం కొత్తగూడెం నుంచి బయల్దేరిన కేసీఆర్ ఇల్లెందు నుంచి బయ్యారం మీదుగా మానుకోట పట్టణానికి చేరుకున్నారు. జిల్లా ఆసుపత్రి ముందు నుంచి ఇందిరాగాంధీ సెంటర్ వరకు చేరుకున్నారు. కేసీఆర్ తన ప్రసంగంలో మానుకోట అని ప్రస్తావించినప్పుడల్లా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన కనిపించింది. మానుకోట జిల్లా ఉండాలా? వద్దా? అన్నప్పుడు ప్రజలు ఉండాలి అంటూ నినాదాలు చేశారు. 'మీ ఉత్సాహం చూస్తుంటే మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నా. మీ ప్రతాపం పార్లమెంట్ ఎన్నికల్లో చూపించి కవితను గెలిపించాలి' అని చెప్పినప్పుడు జనం ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అశేష జనం తరలిరావడంతో మానుకోటలో కేసీఆర్ రోడ్‌షో గ్రాండ్ సక్సెస్ కాగా, బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నయా జోష్ వచ్చింది.



ఇల్లెందు బైపాస్ రోడ్డు నుంచి ర్యాలీగా వస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



కేసీఆర్ ప్రచార వాహనంపై పూలు చల్లి స్వాగతం పలుకుతున్న ప్రజలు